క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: పట్టణంలోని కార్గిల్‌కాలనీలో విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు నిర్వహించనున్న కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ నవీన్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొడంగల్ పట్టణంతోపాటు పర్సాపూర్, కొండారెడ్డిపల్లి, గుండ్లకుంట, పాత కొడంగల్, పలుగురాళ్లతండా, మిషన్ భగీరథ తదితర ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



రాంపూర్‌లో సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జి మారుతి కిరణ్ బూనేటి అన్నారు. ఆదివారం మండలంలోని ఇప్పాయపల్లి, రాంపూర్ గ్రామాలలో బీజేపీ అధ్యక్షుడు సురేశ్‌తో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీ బీజేపీ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, మహిపాల్‌ముదిరాజ్, చంద్రలింగం, సంతోష్‌గౌడ్, రాంచంద్రయ్య, భీమయ్య, మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

దసరా బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభస్వామి ఆలయంలో వచ్చే నెల 3 నుంచి దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈఓ నరేందర్ తెలిపారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని వివరించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



శ్రమదానం చేస్తున్న యువకులు

బంట్వారం: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువకులు శ్రమదానానికి నడుం బిగించారు. కోట్‌పల్లి – వికారాబాద్ ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో ఆదివారం గుంతలను పూడ్చారు. జిన్నారం నుంచి పీలారం వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలపై రాళ్లు, మొరం వేసి చదును చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ.. వికారాబాద్ నుంచి జిన్నారం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. గుంతలు పడిన రోడ్డుపై వాహనాలు వెళ్లలేక పోతున్నాయని వారు పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సత్వరమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రమదానం చేసిన వారిలో మహ్మద్, మహేందర్, నజీం, ఖాజాపాషా, ఇస్మాయిల్, ఇబ్రహీం ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

మర్పల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్



బంట్వారం: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడెపు మల్లేశ్ యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన బంట్వారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన పదవికి వన్నె తెస్తానన్నారు. స్పీకర్ సహకారంతో మార్కెట్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రైతులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. మర్పల్లి, బంట్వారం, మోమిన్‌పేట మండలాల పరిధిలోని రైతులు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా మార్కెట్ కమిటీ పాలకవర్గం దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ రుణమాఫీ చేశారన్నారు. సాంకేతిక కారణాలతో మిగిలిన రైతులకు కూడా రుణమాఫీ వస్తుందన్నారు. ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

నిఘా నేత్రం.. నామమాత్రం

- పనిచేయని సీసీ కెమెరాలు
- సీఎం రేవంత్‌రెడ్డి పూజ చేసిన ఆవు చోరీ
- పట్టించుకోని పోలీసులు



గోమాతకు పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు (ఫైల్)

కొడంగల్: మున్సిపల్ పరిధిలో పలు చోట్ల సీసీ కెమెరాలు పని చేయడం లేదనే విమర్శలున్నాయి. చోరీలు, ప్రమాదాలు జరిగితే నిందితుల గుర్తింపులో జాప్యం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు పట్టణంలోని లాహోటీ కాలనీలో ఉంది. సాక్షాత్తు రాష్ట్ర సీఎం ఇల్లు ఉన్న కాలనీలో కూడా భద్రత లేదు. ఇదే కాలనీలో నివాసం ఉండే రైతు తూము అంజప్పకు చెందిన రెండు ఎద్దులు ఒకసారి, ఆవు మరొక సారి చోరీకి గురయ్యాయి. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కొసమెరుపు ఏంటంటే చోరీకు గురైన ఆవుకు పట్టణంలోని సీఎం నివాసంలో ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి దంపతులు పూజలు చేసి అనంతరం ఓటు వేయడానికి బయలుదేరారు. ఇంత ప్రాముఖ్యం కలిగిన గోవు, ఎద్దులు దొంగతనానికి గురైతే పోలీసుల్లో చలనం లేదని బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేశారు.

అరకొరగా సీసీ కెమెరాలు

అప్పట్లో వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు దాతల సహకారంతో కొడంగల్‌తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. మండల పరిధిలోని మేజర్ గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలను బిగించారు. గ్రామ పోలీస్ అధికారులను నియమించి శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే గతంలో నుంచే సీసీ కెమెరాల నిర్వహణ గాలికొదిలేశారు.

కొరవడిన భద్రత

మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా, బస్టాండ్ ఆవరణ, జాతీయ రహదారి, వినాయక చౌరస్తా, రషీద్ పాన్ షాపు, గాంధీనగర్, బాలాజీనగర్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, హైవే పోలీస్‌స్టేషన్, కొడంగల్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే వాటిలో చాలా కెమెరాలు పని చేయడం లేదు. కొన్ని ప్రధాన ప్రాంతాల్లో మాత్రమే పని చేస్తున్నాయని పోలీసు సిబ్బంది తెలిపారు. నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై తుంకిమెట్ల, నాగిరెడ్డిపల్లి, రేగడి మైలారం, రావులపల్లి, చంద్రకల్ గ్రామాల వద్ద కెమెరాలను ఏర్పాటు చేయాలి. తెలంగాణ–కర్ణాటక సరిహద్దు గ్రామాల దగ్గర నిఘా నేత్రాలు లేవు. మహబూబ్‌నగర్ – తాండూరు రోడ్డుపై సీసీ కెమెరాలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగితే గుర్తించడం కష్టంగా మారింది. కొడంగల్‌లో 50కు పైగా కెమెరాలు ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అందులో నాలుగు మాత్రమే పని చేస్తున్నట్లు సమాచారం.

పశువుల దొంగతనాలు

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దొంగలు పశువులను అపహరిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా పశువుల చోరీలు జరుగుతూనే ఉన్నాయి. కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం, చిట్లపల్లి, హస్నాబాద్ గ్రామాలతో పాటు దౌల్తాబాద్, బొంరాస్‌పేటలో పశువుల దొంగతనాలు జరిగాయి. లక్షల విలువ చేసే ఎద్దులు, ఆవులు, గేదెలు, మేకలను అపహరిస్తున్నారు. దొంగలు పశువులను వాహనాల్లో తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.



అంబేడ్కర్‌చౌరస్తాలో అలంకారప్రాయంగా కెమెరాలు

వేతనాలు అందక ఇబ్బందులు

అధికారులు స్పందించాలని తాత్కాలిక ఉపాధ్యాయుల విజ్ఞప్తి



గురుకుల పాఠశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్‌టైం ఉద్యోగులు

కొడంగల్ రూరల్: మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పార్ట్‌టైం ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. కొడంగల్‌కు చెందిన సాంఘిక సంక్షేమ(ఎస్సీ) బాలుర గురుకుల పాఠశాల, కళాశాల చేవెళ్ల సమీపంలోని ముడిమ్యాల దగ్గర విద్యాబోధన చేస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న గురుకుల పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆదివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మూడునెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, రానున్న పండగల నేపథ్యంలో అధికారులు స్పందిస్తూ వేతనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పీటీ కృష్ణయ్య, చందర్, వాసురామ్, రాజురమేష్, ప్రసాద్, సాయి, పరుశురాం, రాంచందర్, అన్నపూర్ణ, అపర్ణ పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: మద్గుల్ చిట్టంపల్లి వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి బాగు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సూచించారు. ఈమేరకు ఆదివారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 7, 8 వార్డులలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రజా సమస్యలపై వార్డుల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నిస్తామన్నారు. మున్సిపల్ అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, నాయకులు రాజేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుభాని, నరేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మెట్ల నిర్మాణం ప్రారంభం



దుకాణాల ఎదుట మెట్లు కడుతున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

కొడంగల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన ఆరు దుకాణాలకు మెట్లను నిర్మించారు. దీనిపై ఈనెల 20వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'పనులు పూర్తికాకుండానే టెండర్లు' వార్తకు అధికారులు స్పందించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు దుకాణాల ముందు మెట్లను నిర్మిస్తున్నారు. గత ఏడాది అసంపూర్తిగా నిర్మించిన ఆరు దుకాణాలకు పనులు పూర్తి చేయకుండానే టెండర్లు పిలిచారు. ఆరు దుకాణాలకు గానూ ఒక్కో దుకాణానికి రూ.లక్ష చొప్పున డిపాజిట్ తీసుకున్నారు. డిపాజిట్ చెల్లించి పది నెలలు అయినా దుకాణాలను టెండరుదారులకు అప్పగించలేదు. అంతేకాకుండా దుకాణాల ముందు మెట్లు కూడా నిర్మించలేదు. ఈ మేరకు అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకున్నారు.

రుణాలు ఇవ్వాలని తీర్మానం



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా



ధారూరు: సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి


పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా

కొడంగల్ రూరల్: రైతులకు స్వల్పకాల, దీర్ఘకాలిక రుణాలను అందించాలని పీఏసీఎస్ సంఘం కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) హస్నాబాద్, కొడంగల్ సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్తా అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సంఘం జమా ఖర్చుల వివరాలను తెలియజేస్తూ ఆమోదించారు. సంఘం ఆవరణలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుచేయాలని, రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందించాలని శాఖ ఎండీసీసీబీ అధ్యక్షులకు, సీఈఓలకు విజ్ఞప్తిచేయాలని సంఘం కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు నారాయణ, నర్సానాయక్, రాఘవేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, దత్తురెడ్డి, బుగ్గప్ప, పకీరప్ప, రామప్ప, ఎల్లమ్మ, సాయమ్మ, సంఘం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

షరతుల్లేకుండా రుణమాఫీ

ధారూరు: ప్రభుత్వం ప్రకటించిన రూ.రెండు లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో చైర్మన్ సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రైతుల డిమాండ్‌ను అందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే సహకార సంఘాల అధ్యక్ష పదవులను కూడా రిజర్వేషన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎలాగైతే రిజర్వేషన్లు ఉంటాయో అదే విధంగా సహకార సంఘాలకు వర్తింపజేయాని పేర్కొన్నారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణ బకాయిలున్న రైతులు వెంటనే చెల్లించాలని సూచించారు. సమావేశంలో సంఘం వైస్ చైర్మన్ రాజునాయక్, సీఈఓ నర్సింహులు, డైరెక్టర్లు సుధాకర్‌గౌడ్, అబ్దుల్ కరీం, రవీందర్, గోపాల్‌రెడ్డి, శివకుమార్, తులసీనాయక్ పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డు పనులు



మొరం పోసి మరమ్మతులు చేయిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: గ్రామానికి వెళ్లే సింగిల్ రోడ్డుకిరువైపులా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతుండడంతో గ్రామస్తులే రోడ్డు బాగు చేసుకోవడానికి ముందుకొచ్చారు. మండల పరిధిలోని ఊరెళ్ల గ్రామస్తులు ఆదివారం రోడ్డు బాగుచేసుకునే పనులను మొదలుపెట్టారు. చేవెళ్ల నుంచి ఊరెళ్ల మీదుగా మాణికేశ్వరిమాత ఆలయం వరకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరం సింగిల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు రోడ్డు బాగు చేయించేందుకు నడుం బిగించారు. గ్రామ సమీపంలో ఉన్న వంశీరాం బిల్డర్స్‌కు సంబంధించిన భూమిలో మొరం తీసుకోవడానికి వారు అంగీకరించడంతో మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, గ్రామస్తులు మొరం తేవడానికి, చదును చేయడానికి ఖర్చులను భరిస్తూ రోడ్డు చదును చేయించారు.

నేడు సొసైటీ కార్యాలయ భవనం ప్రారంభం

యాలాల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) కార్యాలయ నూతన భవనాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా భవన ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్లు, రైతులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

4 నుంచి క్రికెట్ టోర్నమెంట్

పెద్దేముల్: మండల కేంద్రంలో వచ్చే నెల 4 నుంచి మండలేవల్ చిట్టెపు ప్రకాశ్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు అక్టోబర్ 3వ తేదీలోపు తమ టీం పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి బహుమతి రూ.21 వేలు, రెండో బహుమతి రూ.11 వేలు ఉంటుందన్నారు. టోర్నమెంట్‌కు ఎంట్రీ ఫీజు లేదని తెలిపారు. సమాచారం కోసం ఆర్గనైజర్లు సి.వెంకటేశ్, మతీన్ 99669 52810, 88978 12876లను సంప్రదించాలని కోరారు.

వంతెన రోడ్డుకు మరమ్మతులు

ధారూరు: ఇటీవల వర్షాలకు నిలిచిపోయిన స్టేషన్‌ధారూరు–దోర్నాల్ మార్గంలో కాగ్నా నదిపై రాకపోకలను పునరుద్ధరించారు. ఆదివారం వాహనాల రాకపోకలకు అనువుగా మట్టిని పోసి చదును చేశారు. ఈ నదిపై చేపట్టిన వంతెన నిర్మాణంలో ఉంది. నది మధ్యలో మట్టితో ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు, వాహనాల రాకపోకలు వారాల తరబడి స్తంభించిపోయాయి. దీంతో అధికార యంత్రాంగం స్పందించి డైవర్షన్ రోడ్డుకు మరమ్మతులు చేశారు.

లోక్ అదాలత్‌లో 33 కేసుల పరిష్కారం

యాలాల: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా యాలాల పీఎస్ పరిధిలో 33 కేసులు పరిష్కారమయ్యాయని యాలాల ఎస్ఐ శంకర్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండలంలో నమోదైన కేసుల కక్షిదారులను నచ్చజెప్పి రాజీమార్గానికి తీసుకువచ్చామన్నారు. రాజీ మార్గమే రాజమార్గం అంటూ ఇరు ఫిర్యాదుదారుల కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంత యాలాల పీఎస్‌కు నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగానే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం చేశామన్నారు. కాగా వికారాబాద్ జిల్లాలో లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో వికారాబాద్ టౌన్ పీఎస్ మొదటి స్థానంలో ఉండగా, యాలాల పీఎస్ 33 కేసుల పరిష్కారంతో రెండో స్థానంలో నిలిచింది.

మందుబాబులకు అడ్డాగా రైతువేదిక



దౌల్తాబాద్: రైతువేదిక పక్కన మద్యం బాటిళ్లు



పెద్దేముల్ రైతు వేదికలో పాడైన కంప్యూటర్ మూలకు చేరిన కంప్యూటర్లు

దౌల్తాబాద్: మండలంలోని బిచ్చాల గ్రామ క్లస్టర్ రైతువేదిక మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ రైతువేదికను అప్పట్లో రూ.22లక్షలు వెచ్చించి నిర్మించారు. దీనిలో వారం వారం వ్యవసాయధికారులు, శాస్త్రవేత్తలతో రైతులకు శిక్షణలు ఇస్తూ సీజన్‌లో పంటల వారీగా సాగులో మెలకువలు తెలియజేయడానికి ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ మాత్రం ప్రారంభం నాటి నుంచి రైతు వేదికను ఎప్పుడు తెరవలేదు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటుంది. ప్రారంభించిన శంకుస్థాపన శిలాఫలకం బోర్డు సైతం పగిలింది. పక్కనే టాయిలెట్లకు నిర్మించిన గదుల్లో పశువుల ఆవాసాలుగా మార్చారు. ఈ రైతువేదిక మందుబాబులకు అడ్డాగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతువేదికలు ఇలా నిరుపయోగంగా మారడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఏఈఓ ప్రమీలను అడగ్గా రైతువేదికను గ్రామానికి దూరంగా నిర్మించడంతో రైతులు ఎవరూ రాకపోవడంతో వినియోగించడం లేదన్నారు.

పెద్దేముల్: డిజిటలైజేషన్ కోసం రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ సామగ్రి మూలకు పడ్డాయి. రూ.లక్షలు వెచ్చించి సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉంచినా సరైన నిర్వహణలేక పాడవుతున్నాయి. దీనిపై వ్యవసాయాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల పెద్దేముల్ రైతు వేదికల్లో ఏకలవ్య ఫౌండేషన్, అంబురామేశ్వర రైతు ఉత్పత్తి దారుల సంస్థ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమానికి తాండూరు ఏడీఏ రుద్రమూర్తి హాజరయ్యారు. కానీ వాటి గురించి పట్టించుకోక పోవడం గమనార్హం. కంప్యూటర్‌లు, సీసీ కెమెరాలు, మైకు సెట్‌లను పక్షులు పాడు చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పలు సార్లు రెవెన్యూ అధికారులు కల్యాణ లక్ష్మి చెక్కులు కూడా పంపిణీ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంలోని పెద్దేముల్, మంబాపూర్, ఇందూరు, తట్టెపల్లి, గోపాల్‌పూర్, కందనెల్లి గ్రామాల్లో ఒక్క రైతు వేదికకు సుమారు రూ.20 లక్షలు వెచ్చించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కంప్యూటర్‌తో పాటు వ్యవసాయ రైతులకు సంబంధించిన పరికరాలను భద్రంగా ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఇళ్ల మధ్య ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- తొలగించాలని స్థానికుల వినతి



ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మొయినాబాద్: ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇళ్ల మధ్యనే ఉంది. ఇనుప స్తంభాలతో ఏర్పాటు చేసిన ఈ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచిఉంది. ఇళ్లకు అతి చేరువలో ఉండటంతో వర్షాకాలంలో విద్యుత్ షాక్ తగిలే అవకాశం ఉంది. పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళ్లే అవకాశం ఉంటుందని, ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగక ముందే ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇళ్ల మధ్య నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని కోరుతున్నారు.

మక్కా మసీదులో క్విజ్

కొడంగల్ రూరల్: పట్టణంలోని మక్కామసీదులో ఆదివారం విద్యార్థులకు నాతే షరీఫ్ అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. మైనార్టీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ ఎస్‌ఎం.గౌసన్ నేతృత్వంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మసీదు కమిటీ సభ్యులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హాఫిజ్ అబ్దుల్ రషీద్, కరీం, షేక్ ఆదిల్, మక్సూద్, ఆసిఫ్‌ఖాన్, వాహెద్, అబ్దుల్ రహీమ్, సయ్యద్ మునీర్, అజీమ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మక్కా మసీదు కమిటీ సభ్యులు